సంతృప్త స్థాయిలో సంక్షేమ పాలన

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో ప్రజా సంక్షేమ పాలన సాగుతున్నందుకు గర్వంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష అన్నారు. సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా... 12వ డివిజన్ కార్పొరేటర్ శివ కోటి రెడ్డి ఆధ్వర్యంలో పక్కీరు పల్లె సచివాలయం- 2 ప్రాంతంలోని పక్కీర్ పల్లె ఎస్సీ కాలనీ, బ్రహ్మయ్య షెడ్, వెంకట సాయి నగర్, వాసుదేవ రెడ్డి నగర్, సరస్వతి నగర్ ప్రాంతాల్లోని నివాసాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు.

- వీరపు శ్రీదేవి అనే మహిళ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న ఇంటి స్థలం, నిర్మాణానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ. 10.34లక్షల లబ్ధి పొందామని ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.
- ముమ్మల నాగమ్మ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమ కుటుంబానికి ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకోవడానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ ఆర్ చేయూత, వైఎస్ ఆర్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ. 11.61లక్షల లబ్ధి చేకూరిందని దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామని తెలిపారు.
- ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, బంగారు నాగయ్య, జఫ్రుల్లా, షఫీవుల్లా, రత్నకుమారి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

మార్కెట్ యార్డులో వైఎస్సార్ విగ్రహ ఏర్పాటు

కడప కార్పొరేషన్: కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారని, ఆయన సేవలకు గుర్తింపుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్‌లు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఇబ్రహీం మియ్యా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి, షఫీ, మధు, గోపాలక్రిష్ణ, లక్ష్మినారాయణ, రమ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు

కడప అర్బన్: కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 10వ తేదీన వేంపల్లికి చెందిన చాగలమర్రి మధుసూదన్ (35) మృతి చెందాడు. అతను గత 10 రోజుల కిందట విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ ఈనెల 10న మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి భార్యకు అప్పగించారు. భార్య లక్ష్మీదేవి తన భర్త అంత్యక్రియలు చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేక బంధువులు లేకపోవడంతో శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించింది. వారు స్పందించి మానవత్వంతో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు అమెరికాలో వుంటున్న రజనీకాంత్ ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, సివిల్ సప్‌లై సురేష్, టైలర్ రవి, గుండ్లకొండ రాఘవేంద్ర పాల్గొన్నారు.



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళుతున్న శ్రీకాశీ విశ్వనాథ సేవాసమితి సభ్యులు

మొల్ల నివాసాన్ని పరిరక్షించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: మహా కవయిత్రి మొల్ల నివాసాన్ని పరిరక్షించాలని సాహితీ అభిమానులు కోరుతున్నారు. సోమవారం కడప విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్యాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడారు. మొల్ల నివసించిన ఇల్లు, ఆమె ఆరాధించిన శ్రీకంఠ మల్లేశ్వర ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరాయని ఆవేదన చెందారు. వీటిని పరిరక్షించి భావితరాలకు అందించాలని ఆయన కోరారు. మార్చిలో మొల్ల సప్త శతాబ్ది ఉత్సవాలు ఏడురోజుల పాటు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె. రాధాకృష్ణ, నూను నగేష్, పసుపులేటి శ్రీనివాసులు, రాయుడు, నాగయ్య తదితరులు మాట్లాడారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి

కడప అర్బన్ : మార్చి 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు తమ వంతుగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జాతీయ లోక్ అదాలత్ చైర్మన్ జి.శ్రీదేవి అన్నారు. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో ఎంఈఓపీ, సివిల్ అడ్వకేట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కేసుల్లో రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు: 08562 258622, 244622, ఈ మెయిల్ అడ్రస్: కెపీడిఏపిఎడాట్,డికోర్ట్స్.జీవోవి.ఇన్, డిఎల్ఎస్ఏకెడిపి అట్‌ది డేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌లను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కడపలోని న్యాయసేవాసదన్‌లో...

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని న్యాయసేవాసదన్‌లో పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లతో పోలీస్ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

హామీలన్నీ నెరవేర్చింది సీఎం జగనే

కమలాపురం : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం 2వ వార్డులో ఇంటింటికి తిరిగి సీఎం ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. ఈ పథకాలన్నీ తిరిగి పొందాలంటే త్వరలో ఎమ్మెల్యేగా రవీంద్రనాథ్ రెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని సీఎంగా వైఎస్ జగన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, నిఖిల్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గఫార్, ఇస్మాయిల్, మస్తానయ్య, ఖాజా హుస్సేన్, షావలి, దేవదానం, శంకర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, మోనార్క్ జిలాన్, పుత్తా మధు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వేస్టేషన్‌లో గూడ్స్ షెడ్ హమాలీల సమస్యలను పరిష్కరించాలని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)అధ్యక్ష కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్ మహబూబ్ బాషా కోరారు. సోమవారం కడపకు వచ్చిన గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు మౌలిక వసతులైన తాగునీరు ఉపయోగించే ఫ్రిడ్జ్ చెడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యూనియన్ కార్యాలయం పైన నీటి ట్యాంకు ఏర్పాటు చేసి ప్యూరిఫైడ్ ఫిల్టర్స్ బిగించాలని, గత ఆరు నెలల ముందు డీఆర్ఎంకు విన్నవించినా నేటికి పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ కార్యాలయం పక్కనే రైల్వే లైనుకు ఉపయోగించిన సిమెంటు దిమ్మెలు పక్కనే ఉంచడం మూలంగా వాటి కిందికి మురికి నీరు నిల్వ ఉండి పాములు, తేళ్లు తిరుగుతున్నాయని వాటిని తొలగించి స్కూటర్ పార్కింగ్ కోసం షెడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మరుగుదొడ్లు కూడా కార్యాలయం ఆవరణలో కాకుండా బయటకు తరలించి తగినన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలి యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, గంగయ్య, సుబ్బరామ్, సూరి, మల్లి, రంగనాయకులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఎంఈఓ అవినీతిపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రమ్మ అవినీతి, అక్రమాలపైన విచారణ జరపాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు శ్రీనాథ్, వెంకటేష్, తరుణ్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. వీరభద్రస్వామి కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం కనుల పండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి భస్మాలంకరణ చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి గ్రామోత్సవం బ్యాండు వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. కాంతారా వేషధారణ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అలాగే వీరభద్రస్వామి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం ఉదయం స్వామి వారికి విశేష పూజల అనంతరం మహా కుంభ నివేదన నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్ల తొలగింపు

కమలాపురం : మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె - లేటపల్లె ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు దాదిరెడ్డిపల్లెలో ఆ గ్రామ నాయకుడు చెన్నారెడ్డి, ఎమ్మెల్యే పీఏ కిషోర్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జేసీబీ సాయంతో దాదిరెడ్డిపల్లె - లేటపల్లె ప్రధాన రహదారితోపాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లను తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారికి ఇరువైపు కంపచెట్లు మొలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో కంపచెట్లు తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.



జేసీబీతో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు నరహరిపురం విద్యార్థి

చాపాడు: మండలంలోని నరహరిపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు టి.చరణ్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కేఎల్ నరసింహాశాస్త్రీ తెలిపారు. ఈ నెల 10, 11వ తేదీలలో బద్వేలులో జరిగిన ఇన్‌స్పైర్ పోటీలలో గైడ్ టీచర్స్ సురేంద్రబాబు, బి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న టి.చరణ్ 'ఈ-కేర్ ఫుడ్ స్టోరేజ్ ఫర్ గోడౌన్స్' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మార్చి నెలలో చిత్తూరులో జరిగే రాష్ట్ర పోటీలలో టి.చరణ్ పాల్గొననున్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జబర్దస్త్ టీం

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామిని సోమవారం జబర్దస్త్ టీం దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వారితో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. జబర్దస్త్ టీం చిట్టిబాబు, సినీ హాస్యనటుడు సుమన్‌శెట్టి, సినీ నటి గీతాసింగ్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు.

గ్రామీణాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని యు.రాజుపాలెం, ఇందుకూరు, వెల్దుర్తి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలు, తలపనూరు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామాల రూపురేఖలు మారాయని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరించుకునేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడం, విత్తనాలు కొనుగోలు, పంట విక్రయించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యపరంగా ఏవైనా సమస్యలు తలెత్తితే వారికి అక్కడే గ్రామాల్లోనే వైద్యం అందించేందుకు ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని అందుబాటులో తెచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని స్పష్టం చేశారు. అంతే కాకుండా ప్రతి 50 కుటుంబాలకు ఒక్క వలంటీర్‌ను నియమించి ప్రజలకు ప్రభుత్వ సేవలను గడప వద్దనే ఇస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనంత అభివృద్ధి వైఎస్సార్ ప్రభుత్వంలో జరిగిందని తెలియజేశారు. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం వద్ద ఉన్న వాగు వలన ప్రతి ఏడాది వర్షాకాలంలో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారని గత ఏడాది వాగులో ఇద్దరు వ్యక్తులు ఇరుక్కుపోవడంతో విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.55లక్షలతో వంతెన నిర్మించామన్నారు. అంతే కాకుండా బసిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల మధ్య వాగు ఉండటం, రహదారి సక్రమంగా లేకపోవడంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రూ.2కోట్లతో వంతెన నిర్మించడంతోపాటు బీటీ రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేశామన్నారు. అభివృద్ధి అంటే తెలుగుదేశం నాయకులకు తెలుసా అని ఎద్దేవా చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని నిత్యం ఆరాటపడే వ్యక్తి సీఎం జగన్ అని సీఎంకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు ఉరకలు వేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్, సివిల్ సప్లై డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, రోజారమణి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, తంగెడుపల్లె ఎంపీటీసీ వీరభద్రారెడ్డి, వెల్దుర్తి సర్పంచు విశ్వనాథ్, స్థానిక నాయకులు సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటేసు, రమేష్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఉత్తమరెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్షుమయ్య, గుర్రయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తలపనూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి

క్లుప్తంగా

రేపు ముగింపు సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశాన్ని ఈనెల 14వ తేదిన మధ్యాహ్నం 3.30 గంటలకు ఆర్ఎం కార్యాలయ నూతన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్, డీటీసీ మీరా ప్రసాద్ పాల్గొంటారన్నారు. గతనెల 15 నుంచి ఈనెల 14వ తేది వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు చేయకుండా విధులు నిర్వర్తించిన ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తామన్నారు.

రక్తదానం

కడప కల్చరల్: కడప నగరంలోని టాటా లైఫ్ ఇన్స్రూ కంపెనీ కడపశాఖలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్‌తోపాటు పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. సంస్థ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మానవత్వాన్ని చాటుకునేందుకు రక్తదానం ఉత్తమమైన మార్గమని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ కార్యదర్శి శివశంకర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్వినిలు మాట్లాడుతూ రక్తదానం అవసరం నేటి స్థితిలో ఎంతైనా ఉందన్నారు. టాటా లైఫ్ ఇన్స్రూసంస్థ అసిస్టెంట్ మేనేజర్ వరప్రసాద్‌బాబు, ట్రైనింగ్ మేనేజర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

భీమ్ సభ్యత్వం కార్డులు విడుదల



జై భీమ్ మాల మహాసేన సభ్యత్వ నమోదు కార్డులు విడుదల చేస్తున్న ఆ సంఘం నాయకులు

కడప కార్పొరేషన్: జై భీమ్ మాల మహాసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యత్వ కార్డులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యత, అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మాలలను ఏక తాటిపైకి తెచ్చి, ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు మాలమహాసేన అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన ప్రధాన కార్యదర్శి చైతన్య, శ్యాంసన్, శబాష్టిన్, రాజారత్నం, లక్షుమయ్య, చిన్న, ఓబులేసు, విజయ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రా.రా సాహిత్యంపై హజరతయ్యకు డాక్టరేట్



వైవీయూ: వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కథారచయిత 'రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా) కాల్పనిక సాహిత్యం-పరిశీలన' అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగుశాఖ అధ్యాపకుడు టి.హజరతయ్యకు డాక్టరేట్ ప్రకటించారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగుశాఖ ఆచార్యులు డా. పేట శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో ఈయన 'రారా కాల్పనిక సాహిత్యంపై పరిశోధన చేశారు. దీంతో ఈయనకు డాక్టరేట్ ప్రదానం చేస్తూ ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రకటన జారీచేశారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం, జడదేవి గ్రామం ఈయన స్వస్థలం.

వైవీయూలో క్యాంటీన్ నూతన భవనం ప్రారంభం



క్యాంటీన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 'ఒయాసిస్' పేరుతో నూతన క్యాంటీన్ భవనాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్.. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం రూ. 55 లక్షలు వెచ్చించి అధునాతన భవనాన్ని నిర్మించామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆహ్లాదకరమైన వాతావరణంలో, సౌకర్యవంతంగా ఆహారపదార్థాలు భుజించేలా వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రధాన ఇంజినీర్ రాజశేఖరరెడ్డి, అధ్యాపకులు ఆచార్య జి. విజయరాఘవప్రసాద్, ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఆచార్య ఎ. మధుసూధన్‌రెడ్డి, డా. సుబ్రమణ్యంశర్మ, డీఈ రామచంద్రారెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాధాకృష్ణ నగర్‌లో మట్కా రాస్తున్న షేక్ అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తిని ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 10,050 నగదును మట్కా స్లీప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

వైవీయూ వీసీతో రాయలసీమ యూనివర్సిటీ వీసీ భేటీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌తో కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్ సమావేశమయ్యారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విశ్వవిద్యాలయాల ప్రగతి గురించి చర్చించారు. అనంతరం వైవీయూ అధికారులు ఆచార్య బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్ పాల్గొన్నారు.

రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించండి



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయలసీమ విశ్వ విద్యాలయ వీసీ సుధీర్

కడప కార్పొరేషన్: రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి. సుధీర్ ప్రేమ్ కుమార్ కోరారు. ఇటీవలే విశ్వ విద్యాలయం ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడిన ప్రాంతమైన కర్నూలు జిల్లాలో నెలకొల్పిన రాయలసీమ విశ్వ విద్యాలయ పురోగతికి అవసరమైన నిధుల మంజూరు విషయంలో సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. అందుకు స్పందించిన డిప్యూటీ సీఎం యూనివర్సిటీ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు అభినందన



అంకన్నకు రిలీవింగ్ పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమితులైన వైవీయూ ఆంగ్లశాఖ సహ ఆచార్యులు డా. నాగుల అంకన్నను విశ్వవిద్యాలయ విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య రిలీవింగ్ పత్రాన్ని ఆయనకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.


స్కాట్ ఎన్నికలపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్: భారత్ స్కాట్ ఎన్నికలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు కోరారు. సోమవారం ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈనెల 3న జరిగిన ఎన్నికలను రద్దు చేయాలన్నారు. అప్పటి డీఈఓ రాఘవరెడ్డి ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. 230 మంది సభ్యుల సమక్షంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికలను విద్యాశాఖ కమిషనర్ నిబంధనలకు విరుద్ధంగా డీఈఓ నిర్వహించారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులు చంద్ర, నాయకులు అశోక్,గణేష్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీనగర్ రోడ్, ఎర్రముక్కపల్లి సమీపంలో చిలకల చాన్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సోమవారం రాత్రి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణుల హర్షం



మాట్లాడుతున్న బొమ్మన సుబ్బరాయుడు

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి పనులపై గ్రామీణులు తమ హర్షం వ్యక్తం చేస్తున్నారని బీజేపీ కడప పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం కడప నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాన పర్యటిస్తున్నామన్నారు. తాము ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి స్పందన వస్తోందన్నారు. ఈ సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.